క్లుప్తంగా

ఆర్‌ఎస్‌ఎస్ సభ్యత్వ నమోదు



బీబీపేట: ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని ఆర్‌ఎస్‌ఎస్ నేతలు సభ్యత్వాలను స్వీకరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. సంఘ శతాబ్ది ఉత్సవాలలో హిందువులు అందరం పాల్గొని, హిందూ ఐక్యతను చాటుదామని, స్వదేశీ భావనను పెంచుదామని అన్నారు. త్వరలో జరగబోయే హిందూ కుటుంబ సమ్మేళనాలు – పద సంచలనకు పెద్ద ఎత్తున సిద్ధమవుతున్నామని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

కూలిన ఇల్లు



భిక్కనూరు: మండల కేంద్రంలో కురుస్తున్న వానలకు ఒకరి ఇల్లు ఆదివారం వేకువజామున కూలింది. మండల కేంద్రానికి చెందిన అంబల్ల మల్లమ్మ ఇల్లు కురుస్తున్న వానలకు కూలిపోయింది. కూలిన సమయంలో ఇంటి యజమాని మల్లవ్వ ఇంట్లో లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

వైద్య శిబిరాల ఏర్పాటు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నాగిరెడ్డిపేట, మాల్తుమ్మెద, కిచ్చన్నపేట, చీనూర్, ధర్మారెడ్డితండా, జలాల్‌పూర్, చిన్న ఆత్మకూర్, పల్లెబోగుడతండాలో ఆదివారం వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరాలకు వచ్చిన ప్రజలకు పరీక్షలు జరిపారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ పరీక్షలతోపాటు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. శిబిరాలను పీహెచ్‌సీ డాక్టర్ సృజన్ పరిశీలించి వైద్య సిబ్బందికి పలుసూచనలు చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు మణెమ్మ, సునంద, ఎంఎల్‌హెచ్‌పీలు అజయ్, దేవిదాస్, రాశి, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వరద బాధితులకు ఆదివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు క్లబ్ అండగా ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు. నేతలు గాదారి గంగారెడ్డి, విండో చైర్మన్ కమలాకర్ రావు, సుతారి కృష్ణమూర్తి, రాజన్న, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల పింఛన్ రూ.5 వేలకు పెంచాలి



దోమకొండ: బీడీ కార్మికులకు ఈపీఎఫ్ ద్వారా అందిస్తున్న పింఛన్‌ను నెలకు రూ.5 వేలకు పెంచాలని నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన బీడీ కార్మికులతో మాట్లాడారు. ప్రస్తుతం ఈపీఎఫ్‌ను కార్మికులకు రూ.1000 మాత్రమే అందిస్తున్నారన్నారు. అదేవిధంగా బీడీ కార్మికుల పిల్లలకు ప్రతి ఏడాది రెగ్యులర్ బీడీ స్కాలర్‌షిప్ అందించాలన్నారు. సంఘం ప్రతినిధులు ఐరేని నర్సయ్య, తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు



కామారెడ్డి అర్బన్: బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా అడ్డుకోవాలని, 18 ఏళ్లలోపు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడం నేరమే కాకుండా సాంఘిక దురాచారమని, వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని సాధన స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త గిరిజ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆలయాలు, మసీదులు, చర్చిల వద్ద బ్యాల వివాహాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. సంస్థ ప్రతినిధులు జ్యోతి, సంధ్య, రాణి, మమత తదితరులు పాల్గొన్నారు.

నిద్రపోతున్న నిఘానేత్రం

- పల్లెల్లో అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు
- పట్టించుకోని పోలీసులు



పనిచేయని కమాండ్ కంట్రోల్ యూనిట్



బోర్లం గాంధీ కూడలిలో అలంకారప్రాయంగా ఉన్న సీసీ కెమెరాలు

బాన్సువాడ రూరల్: ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని అంటుంటారు. అటువంటి సీసీ కెమెరాలు బాన్సువాడ మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో పని చేయడం లేదు. దీంతో ప్రజల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు, చోరీలు పెరిగాయి. ఐదారేళ్ల క్రితం పోలీసు శాఖ వారు ప్రత్యేక చొరవ తీసుకుని నాటి సర్పంచ్‌లను, ప్రజాప్రతినిధులను, గ్రామపెద్దలు, దాతలను ప్రోత్సహించి రూ.లక్షలు వెచ్చించి ఊరూరా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఆరంభ శూరత్వంగా కొన్ని నెలలపాటు బాగానే కొనసాగినా ప్రస్తుతం అవి ఎక్కడా పనిచేయకపోయినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. గ్రామాల్లో సీసీ కెమెరాలుండగా తగ్గుముఖం పట్టిన నేరాల సంఖ్య ప్రస్తుతం అవి పనిచేయకపోవడంతో పెరిగాయి. రోడ్డు ప్రమాదాలు, బైకులు, ఇతర చోరీలు, గొడవలు, ఇతర ఘటనలు జరిగినప్పుడు వాటిని ఛేదించడం పోలీసులకు సవాలుగా మారుతోంది.

మేజర్ గ్రామాల్లోనూ.. మారుమూల తండాల్లోనూ

బాన్సువాడ పట్టణం మినహా మండలంలోని ఏ ఒక్క గ్రామంలోనూ సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. మండలలలోని బోర్లంలో 6 కెమెరాలు, కోనాపూర్‌లో 5, కాద్లాపూర్‌లో 3, సోమేశ్వర్, హన్మాజీపేట్ గ్రామాల్లో 4 చొప్పన కెమెరాలు ఉన్నా వాటిలో ఏ ఒక్కటి పనిచేయడం లేదు. పంచాయతీల్లో సర్పంచ్‌లు కొనసాగిన తరుణంలో వాటికి చిన్నచిన్న మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు వాటి నిర్వహణ మరిచారు. అధికారులు ఇప్పటికై నా స్పందించి గ్రామాల్లో సీసీ ప్రస్తుతం ఉన్న కెమెరాలను ఉపయోగంలోకి తేవడంతో పాటు మరిన్ని కెమెరాలు ఏర్పాటు చేసి ప్రజల్లో భద్రతపట్ల నమ్మకం కల్గించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపయోగంలోకి తెస్తాం



గ్రామాల్లో సీసీ కెమెరాలు పాడైపోయిన విషయం వాస్తవమే. వాటి మరమ్మతులకు ప్రత్యేకంగా నిధులేమీ లేవు. గ్రామపెద్దలతో, దాతలతో మాట్లాడుతున్నాం. అతి త్వరలోనే కెమెరాలను ఉపయోగంలోకి తెస్తాం.

– మండల అశోక్, సీఐ, బాన్సువాడ

నూతన కార్యవర్గాలు

బీసీ మహిళా సంక్షేమ సంఘం మండల కార్యవర్గం



భిక్కనూరు: మండల బీసీ మహిళా సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం భిక్కనూరు స్థానిక నగరేశ్వరాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీ మహిళ సంక్షేమ సంఘం మండలాధ్యక్షురాలిగా లింగాల వినీత, ఉపాధ్యక్షురాలిగా లింగాల లావణ్య, ప్రధాన కార్యదర్శిగా శేర్ల యమున, సహాయ కార్యదర్శిగా నాగారపు శ్యామల, పట్టణాధ్యక్షురాలిగా మాడ నాగరాణిలు ఎన్నికయ్యారు. వీరికి కామారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాప శివరాములు, ఉపాధ్యక్షుడు గుడిసె యాదగిరిలు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలిగా ఎన్నికై న వినీత మాట్లాడుతూ.. బీసీల హక్కుల సాధనకు కృషిచేస్తానన్నారు.

పట్టణ స్వర్ణకార సంఘం..



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా మర్కంటి పి.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా బస్వాపురం ఎం.ప్రభాకర్, కోశాధికారిగా సీహెచ్.శేషులు ఎన్నికయ్యారు. ఎన్నికైన ప్రతినిధులను సంఘం పెద్ద మనుషులు ఘనంగా సన్మానించారు.

సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



ఎల్లారెడ్డిలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తూ..

ఎల్లారెడ్డి/లింగంపేట: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీదవారికి పెళ్లిళ్ల సమయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా లక్ష నూట పదహారు రూపాయలను అందిస్తోందన్నారు. ఆర్డీవో పార్థసింహారెడ్డి, ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, గాంధారి తహసీల్దార్లు, మున్సిపల్ మాజీ చైర్మన్లు కుడుముల సత్యనారాయణ, పద్మశ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు సాయిబాబా, వినోద్‌గౌడ్, వెంకట్రాం రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, గోపి, ఎల్లారెడ్డి, గాంధారి ఏఎంసీ చైర్‌పర్సన్లు రజిత, పరమేష్ ఉన్నారు.

జిల్లా కేంద్రంలో..

రాజంపేట: ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన రాజంపేట మండలంలోని ఎల్లారెడ్డిపల్లి, బసవన్నపల్లి, అన్నారం, కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో ఈ చెక్కులు పంపిణీ చేసినట్లు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్‌రెడ్డి తెలిపారు. నేతలు వినోద్ కుమార్, బన్సీలాల్ నాయక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో మైనార్టీల ర్యాలీ



ఎల్లారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న మైనార్టీలు



ఎల్లారెడ్డిలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న ముస్లిం వెల్ఫేర్ కమిటీ సభ్యులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో మైనార్టీలు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీ కార్యక్రమంలో భాగంగా మైనార్టీలు షాబాషావాలీ దర్గా నుంచి బస్టాండ్, గాంధీచౌక్ మీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నాయకులు గయాజుద్దిన్, ముకరం, రఫీక్ తదితరులున్నారు.

రక్తదాన శిబిరం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పట్టణంలోని షాదీఖానాలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మైనార్టీ నాయకులు గయాజుద్దీన్, జమీల్, బాలు, అలీ తదితరులున్నారు.

సమాచారం..

ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు పెంపు

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీసెంటర్‌లో ప్రవేశాల గడువును ఈ నెల 26 వరకు పెంచినట్లు అధ్యయన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ గంగాధర్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు స్టడీసెంటర్‌లో డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరాలన్నారు. 2024–25లో ప్రవేశం పొందిన వారు రెన్యువల్ చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. వివరాలకు www.braou.online.in గానీ టోల్‌ఫ్రీ నంబర్ 18005990101లో గానీ సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి డిగ్రీకళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

బాన్సువాడ రూరల్: డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే దోస్త్‌కు ఆశించిన స్పందన రాకపోవడంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నారు. బాన్సువాడలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ వివిధ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి సోమవారం నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ గంగాధర్ తెలిపారు. ఇంటర్మీడియేట్, తత్సమాన రెండు సంవత్సరాల కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు.

20వరకు ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు

బాన్సువాడ రూరల్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఎస్సెస్సీతో పాటు ఇంటర్మీడియేట్ ప్రవేశాల గడువును ఈ నెల 20 వరకు పెంచినట్లు ఎంఈవో నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 18 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా, 20 వరకు అపరాధ రుసుముతో దరఖాస్తుకు అవకాశం కల్పించారన్నారు. మీ–సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యాభ్యాసాన్ని మధ్యలో ఆపేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రధానోపాధ్యాయుల సమావేశం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం సమావేశం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి షౌకత్‌అలీ తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ అందరూ సకాలంలో హాజరుకావాలని కోరారు.

తహసీల్ కార్యాలయాల ముట్టడి

ఎల్లారెడ్డి/తాడ్వాయి: నేడు తహసీల్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆదివారం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ ఇస్తామని చెప్పి ఏడాదిన్నర కావస్తున్న ఇంతవరకు అమలు చేయకపోవడంతో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు తహసీల్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఆర్‌పీఎస్ నాయకులు పద్మారావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు చిట్యాల సాయన్న ఒకప్రకటనలో తెలిపారు.

ప్రకృతి వనం.. వికృత రూపం



నాగారం గ్రామంలోని ప్రకృతి వనం దుస్థితి

బాన్సువాడ రూరల్: పట్టణ ప్రజలకు మాత్రమే పరిమితమైన పచ్చని పార్కులు పల్లెపల్లెలోనూ ఉండాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. కాని కొన్ని గ్రామాల్లో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా ప్రకృతి వనాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. కురిసిన వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో వనం మురికినీటితో నీటితో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రకృతి వనంలో నాటిన అసలు మొక్కలకంటే పిచ్చి మొక్కలు ఎక్కువైపోయాయి. దీంతో పచ్చని, ఆహ్లాదకర ప్రకృతి కన్పించాల్సిన ప్రదేశం వికృత రూపం దాల్చింది. అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కలను కాపాడి ప్రజలకు ఆహ్లాదాన్ని కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఈ రహదారిపై వెళ్లేదెలా..?



మద్నూర్(జుక్కల్): నాయకులు, అధికారులు మా గ్రామానికి వచ్చి వెళ్తారే తప్ప సమస్యలు వారికి పట్టవని రాచూర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాచూర్ గ్రామానికి వెళ్లే రహదారిపై బురద, వరద నీరు ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి ఇంత వరకు బీటీ రోడ్డు నిర్మించలేదు. ఇటీవల భారీ వర్షాలతో రోడ్డు తెగిపోయి కష్టాలు పడ్డామని వారు గుర్తు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి మంచి రోడ్లు వేయాలని కోరుతున్నారు.

ఇది ప్రభుత్వ ఆస్పత్రిలోని రోడ్డే



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోడ్డు అధ్వానంగా మారింది. ఆస్పత్రిలోని 108 కార్యాలయం ముందు మోకాలి లోతు బురద, నీరు పేరుకుపోయి రోజులు గడుస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారని రోగులు ఆరోపిస్తున్నారు. వరదనీరు, బురద, ఆస్పత్రి ఆవరణలో పిచ్చి మొక్కలతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయని రోగులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇది బీటీ రోడ్డా.. లేక మట్టి రోడ్డా..?



బీటీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు బీటీ, సీసీ రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు పేరుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ పాలకవర్గాలు లేకపోవడంతో కనీసం గ్రామ స్థాయి అధికారులు కూడా సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. మండల కేంద్రంలో నంది విగ్రహం వద్ద బీటీ రోడ్డుపై భారీగా వర్షపు నీరు నిలిచి ఉండడంతో రోడ్డు పాడైంది. మట్టి రోడ్డును తలపిస్తోంది. అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బురదమయంగా పాఠశాలకు వెళ్లే రోడ్డు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని తాడ్వాయి– చందాపూర్ రహదారి నుంచి కస్తూర్బా గాంధీ పాఠశాలకు వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది. దీంతో సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు ఈ రోడ్డు బురదగా మారి గుంతలుగా ఏర్పడుతున్నాయి. రోడ్డుపై నాసిరకం మొరం పోయడంతోనే ఈ విధంగా తయారైందంటున్నారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు చెప్పినా ఫలితం లేకుండా పోయిందని, ఇప్పటికైనా బాగు చేయించాలని కోరుతున్నారు.

మెంగారం చెరువు అలుగు ధ్వంసం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం గ్రామ శివారులోని ఊర చెరువు అలుగును గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు చెరువుకు ఉన్న రెండు అలుగులపై మీటరు ఎత్తు వరకు పొంగి ప్రవహించాయి. గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు మీటర్ల పొడవు అలుగును తవ్వేయడంతో నీరంతా వృథాగా పోయింది. దీంతో గ్రామస్తులు ఇసుక బస్తాలు అడ్డుగా వేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి అలుగుకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

తెలుగుభాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలి



మద్నూర్ గురుకుల పాఠశాలలో ఆకులపై తెలుగు అక్షరాలను తయారు చేసిన విద్యార్థులు

మద్నూర్(జుక్కల్): తెలుగు భాషను ప్రతి ఒక్కరు గౌరవించి, ప్రేమించాలని బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నందాల గంగాకిషోర్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం తెలుగు వెలుగు అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణలో జానపదాలతో కూడిన అనేకమైన పదజాలాలు ఏర్పడ్డాయని తెలంగాణ తెలుగు యాసతో బాసతో మంచి ఆత్మీయ పలకరింపులతో ఉంటుందని అన్నారు. తెలంగాణ పదాలు, వ్యాక్యాలు, పాటలు, సంధులు, సమాసాలు, కథలు, నాటికలు, కథానికలు విద్యార్థులకు ఉపయోగపడుతాయని అన్నారు.

అలరించిన తెలుగు తోరణం

విద్యార్థులు స్వయంగా తయారు చేసిన తెలుగు వర్ణమాల తోరణము చక్కగా అలరించింది. రుద్రమదేవి ఏకపాత్రాభినయం, హాస్యనాటికలు, తెలుగు పాటలు రంజింపజేశాయి. 5 నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు 151 చార్టుల్లో వివిధ రకాలైన తెలుగు సాహిత్యం, వ్యాకరణం, కవుల జీవన శైలి, కావ్యాలు, శాస్త్రాలు తదితరవాటిని ప్రదర్శించారని ప్రముఖ పద్యకవి, కవియాత్ర జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ అన్నారు. తెలుగు భాషా పండితులు రాము, ప్రవీణ్ కుమార్, శైలజ, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

వృథాగా పోతున్న నీరు



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో తాగునీరు వృథా పోతోంది. తాగునీటి కుళాయికి ఆన్, ఆఫ్ చేసే ట్యాప్ లేకపోవడంతో నీరు సరఫరా చేస్తున్న సమయంలో నీరు ఎగసిపడుతోందని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సంక్షిప్తం

ప్రతి మున్నూరుకాపు సంఘ సభ్యత్వం తీసుకోవాలి

కామారెడ్డి అర్బన్: ప్రతి మున్నూరుకాపు వంద రూపాయలు చెల్లించి సంఘ సభ్యత్వం తీసుకోవాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యవర్గం తీర్మానించినట్టు జిల్లా గౌరవ అధ్యక్షుడు మామిండ్ల అంజయ్య, రాష్ట్ర కార్యదర్శి నీలం నర్సింలు అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా మాసాయిపేటలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.పురుషోత్తంరావు పటేల్ ఆధ్వర్యంలో రాష్ట్ర సమావేశం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా నుంచి మామిండ్ల లింగం, కాసర్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో భగవద్గీత ప్రవచనాలు

కామారెడ్డి అర్బన్: అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత సత్సంగం నిర్వహించారు. భక్తులు భజనలు, కీర్తనలు, భగవద్గీత ప్రవచనాలు, మహాప్రసాదం వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఇస్కాన్ ఇన్‌చార్జి వెంకటదాసు ప్రభు, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ భవానిమాత ఆలయానికి సిమెంటు వితరణ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఒంటర్‌పల్లి తండాలో నిర్మాణం చేపడుతున్న గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్, భవానిమాత ఆలయానికి భీమ్‌రావు సిమెంటు వితరణ చేశారు. మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన ప్రముఖ శిల్పకారుడు భీమ్‌రావు.. ఒంటర్‌పల్లి తండాలో నిర్మాణం చేపడుతున్న సేవాల్, భవానిమాత ఆలయాలకు తన వంతుగా 20 బస్తాల సిమెంటు కోసం ఆర్థిక సహాయం అందజేశారు. మాజీ సర్పంచ్ రాందాస్, బలరాం, సుభాష్, జగ్గురాం, పీర్యా, వినోద్, తండావాసులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మహిళా సంఘాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలని సీసీ గంగారెడ్డి అన్నారు. కరడ్‌పల్లిలో ఆదివారం గ్రామ సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆర్థిక లావాదేవీలపై చర్చించారు. ప్రతి నెలా 10లోపు స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు చెల్లించేలా తీర్మానాలు చేశారు.

ఎల్లారెడ్డి బంజారా సంఘం యూత్ అధ్యక్షుడిగా గణేష్

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండల బంజారా సంఘం యూత్ అధ్యక్షుడిగా గణేష్‌ను ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు ఆదివారం తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా సేవ్యా, కోశాధికారులుగా బన్సీ, సంగ్రాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు వెల్లడించారు.

సొంత భూమిలో పైప్‌లైన్ వేశారని ఆందోళన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సొంత భూమి నుంచి మిషన్ భగీరథ పైప్‌లైన్ వేశారని బాధిత రైతులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేసిన ఘటన లింగంపల్లిలో చోటు చేసుకుంది. ఈ విషయమై తహసీల్దార్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని పట్టాదారు రైతులు మేర భాస్కర్ పేర్కొన్నారు. ఈ విషయమై గ్రిడ్ ఏఈ భానును సంప్రదించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పైప్ లైన్ వేస్తున్నామని సమాధానం ఇచ్చారు.